నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, సోమవారం 2 డిసెంబర్ 2024 | MEDAK




కంది ఐఐటీహెచ్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న పోటీదారులు

## అట్టహాసంగా హాఫ్ మారథాన్

- కంది ఐఐటీహెచ్‌లో రన్‌ను ప్రారంభించిన సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్
- పాల్గొన్న 1500 మంది పోటీదారులు

కంది, డిసెంబర్ 1: శారీరకరంగా, మానసికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకోగలమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం హాఫ్ మారథాన్ 2024ను అట్టహాసంగా నిర్వహించారు. హాఫ్ మారథాన్ (21.1 కిలోమీటర్) 10కే రన్, 5కే రన్‌లో దేశ నలుమూలల నుంచి 1500 మంది పోటీదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ మాలావత్ హాజరయ్యారు. సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, క్రమశిక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. పూర్ణ మాలావత్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ హాఫ్ మారథన్ స్ఫూర్తిని నింపి చక్కని జీవన శైలిని ప్రేరేపిస్తున్నదన్నారు. ఐఐటీహెచ్ హాఫ్ మారథాన్ 2024 కేవలం ఒక పరుగు పోటీ కాకుండా ఉల్లాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు ప్రేమ్‌పాల్, డాక్టర్ హిమాంశు జోషి, డాక్టర్ ఉపేందర్ సుంకరి, విద్యార్థులు పాల్గొన్నారు.




హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్



సంగారెడ్డి జిల్లా కవేలిలో ఆదివారం ఫోన్‌లో పంట రుణమాఫీ జాబితాలో తమ పేర్లు చూసుకుంటున్న రైతులు

## మళ్లీ నిరాశే!

- పంటరుణమాఫీ జాబితా ప్రకటించిన ప్రభుత్వం
- సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలి గ్రామ రైతుల పేర్లు గల్లంతు

కోహీర్, డిసెంబర్1: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పలు బ్యాంకులు, పీచెర్యాగడి, మాచిరెడ్డిపల్లి, బిలాల్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.2లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులకు పంట రుణమాఫీ కాలేదు. శనివారం ప్రభుత్వం పంట రుణమాఫీ జాబితా ప్రకటించిన విషయం తెలిసిందే..ఆదివారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలి గ్రామంలో మొబైన్ ఫోన్‌లో పంటరుణమాఫీ జాబితాను రైతులు పరిశీలించగా పేర్లు కనిపించకపోవడంతో నిరాశకు లోనయ్యారు. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేస్తామని చెప్పిందని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం ముందుగా రూ.2లక్షలు వేస్తే మిగతా డబ్బులు బ్యాంకుల్లో కడతామన్నారు. పంట రుణమాఫీ విషయంపై మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా పూర్తి వివరాలు బ్యాంకుల్లో ఉంటాయన్నారు.

## అందని ద్రాక్షలా వైద్యం

### పరిశ్రమలు ఒకచోట, డిస్పెన్సరీ మరోచోట.. మార్చాలని విజ్ఞప్తి చేసినా మారని వైనం

- నిరుపయోగంగా ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనం
- రోగులకు అందని వైద్యం
- సంగారెడ్డి జిల్లా బొల్లారం మండలంలో పరిస్థితి

బొల్లారం, డిసెంబర్ 1: కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలు అందని ద్రాక్షలా మారుతున్నాయి. సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో 2012లో బాచుపల్లిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని అధికారులు ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. వైద్య సేవలు పొందడానికి వ్యయ ప్రయాసాలు పడాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీని బొల్లారానికి తరలించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని స్థానికులు, కార్మికులు వాపోతున్నారు.

#### ఈఎస్ఐ డిస్పెన్సరీని తరలించాలి

ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో సుమారు 200 పైచిలుకు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో సుమారు 90వేల పైచిలుకు కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా పరిశ్రమల్లో పనిచేసే 63 వేల మంది కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కార్మికుల వేతనం నుంచి నెలనెలా ఈఎస్ఐ కింద నగదు కోత విధిస్తున్నారు. అయితే బాచుపల్లిలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉండడంతో కార్మికులకు ఈఎస్ఐ సేవలు అందడం లేదు. ఒకవేళ కార్మికులు ఈఎస్ఐ సేవలు పొందాలంటే నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది.కాలయాపనతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. కాగా వీరిలో 80శాతం ఇతర రాష్ర్టాలకు చెందిన వారే ఉన్నారు. బొల్లారంలోని గాంధీనగర్ 284 సర్వే నెంబర్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం కేటాయించిన స్థలంలో సీఎస్ఆర్ నిధులతో భవనాన్ని నిర్మించినా ఇప్పటి వరకు బాచుపల్లిలో నిర్వహిస్తున్న ఈఎస్ఐ డిస్పెన్సరీని బొల్లారానికి తరలించడంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సంగారెడ్డి జిల్లా బొల్లారంలో నిరుపయోగంగా ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనం



సంగారెడ్డి జిల్లా బాచుపల్లిలోని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీ

#### ఇబ్బంది పడుతున్నాం



పరిశ్రమలు ఒక చోట డిస్పెన్సరీ మరోచోట ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. సకాలంలో వైద్యం అందడం లేదు. బాచుపల్లికి వెళ్లాలంటే సమయంతో పాటు ఆర్థిక భారం పడుతున్నది. స్థానిక ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నాం. అధికారులు చొరవ తీసుకొని ఈఎస్ఐ డిస్పెన్సరీని బొల్లారానికి తరలిస్తే మాకు అన్ని విధాలా మేలు జరుగుతుంది.

– సంజీవ్, కార్మికుడు, బొల్లారం

#### సేవలందించాలి



కార్మికులకు అందుబాటులోనే వైద్యసేవలు అందించాలి. ఈఎస్ఐ డిస్పెన్సరీకి స్థలం కేటాయించి భవనాన్ని నిర్మించాం. నూతన భవనంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఈఎస్ఐ సేవలతో కార్మికుల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది.

– రోజాబాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్, బొల్లారం, సంగారెడ్డి జిల్లా

## వలస బాట

ప్రభుత్వాలు మారినా గిరిజనుల జీవితాలు మారడం లేదు. సొంత గ్రామంలో ఉపాధి లేక గిరిజనులు వసలబాట పట్టారు. నారాయణఖేడ్ డివిజన్ నుంచి సంగారెడ్డి పట్టణ శివారులో చెరుకు నరికేందుకు ఎడ్లబండ్లతో గిరిజనులు ఆదివారం వస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.

– నమస్తే తెలంగాణ జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి




## అంబులెన్స్ లేక అవస్థలు

### సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో పరిస్థితి



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- రోగులకు తప్పని తిప్పలు
- అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలే దిక్కు

రాయపోల్, డిసెంబర్ 1: ప్రమాదాలకు గురైన బాధితులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించడానికి 108 అంబులెన్స్ లేక సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ప్రతి మండలానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు దాని పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తుంది. గతంలో ఉమ్మడి దౌల్తాబాద్‌కు అంబులెన్స్ కేటాయించారు. ఏడేండ్ల క్రితం రాయపోల్ మండలం ఏర్పడినా ఇంత వరకు అంబులెన్స్ కేటాయించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయపోల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా 22వేల జనాభా ఉన్నది. 19 గ్రామ పంచాయతీల పరిధిలో మూడు మధిర గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు ప్రమాదాలు, అనారోగ్యానికి గురైనప్పుడు వారిని దవాఖానకు తరలించాలంటే పక్క మండలాల నుంచి అంబులెన్స్ రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కోసారి అక్కడ కూడా అంబులెన్స్ లేనప్పుడు ప్రజల ప్రాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో స్థానిక ప్రాథమిక అరోగ్య కేంద్రంలో అంబులెన్స్ సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల ద్వారా దవాఖానకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాయపోల్ మండల కేంద్రంలో ఇటీవల మూలుమలుపు వద్ద ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. 108కు ఫోన్ చేసినా గంట వరకు రాలేదు. దీంతో క్షతగాత్రులను ఆటోలోనే తరలించారు. అత్యవసర సమయంలో రోగులను గజ్వేల్, హైదరాబాద్ దవాఖానలకు తరలించడానికి అంబులెన్స్ లేక ప్రైవేట్ వాహనాల్లో తీసుకువెళ్లాల్సి వస్తున్నదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే రాయపోల్ మండలానికి 108 అంబులెన్స్ కేటాయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా కార్తిక దీపోత్సవం

- అంధకారాన్ని కార్తికదీపం తొలిగిస్తుంది
- సిద్దిపేట జిల్లా మాజీ జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు, డిసెంబర్ 1: అజ్ఞానం అనే అంధకారాన్ని కార్తికదీపం తొలిగిస్తుందని సిద్దిపేట జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ రంగనాయకసాగర్ ప్రాజెక్టులో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీప వెలుగులు ఉన్నచోట ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, కీర్తిప్రతిష్టలు వెల్లివిరుస్తాయన్నారు. కార్తికమాసం పర్వదినాన్ని పురస్కరించుకొని వెలిగించే దీపాలు సమాజంలో చెడు, దుఃఖం, నిరుత్సాహం తొలిగిస్తుందన్నారు. అందుకే కార్తికదీపం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు నింపే గొప్ప పండుగగా ప్రసిద్ధి చెందిందన్నారు. గులాబీ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్లిపూర్ సొసైటీ వైస్ చైర్మన్ అనుపాటి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దుర్గారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగం, మహిళలు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా చంద్లాపూర్ రంగనాయక సాగర్‌లో కార్తికదీపాలు వెలిగిస్తున్న సిద్దిపేట జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మహిళలు

## నిరుపయోగంగా ఫంక్షన్‌హాల్

గజ్వేల్, డిసెంబర్ 1 : గ్రామీణ పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో గ్రామాల్లో ఫంక్షన్‌హాళ్లను అత్యాధునిక హంగులతో నిర్మించారు. గ్రామాల్లో శుభకార్యాలు, పెండ్లిళ్లు చేసుకునేందుకు వీలుగా నిర్మించిన ఫంక్షన్‌హాళ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామ సమీపంలోని పాఠశాల వద్ద ఫంక్షన్‌హాల్‌తో పాటు డైనింగ్, కిచెన్‌ను నిర్మించారు. కోటి రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించడంలో ఆసక్తి చూపించిన అధికారులు దానిని వినియోగంలోకి తీసుకురావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రారంభం నాటి నుంచి ఫంక్షన్‌హాల్‌కు తాళం వేసి ఉంచుతున్నారు. పెండ్లిళ్ల సీజన్ కావడంతో గజ్వేల్‌లో ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లు దొరకడం సమస్యగా మారింది. దొరికినా ఎక్కువ డబ్బులు ఖర్చు చేయలేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారి కోసం కేసీఆర్, హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో గజ్వేల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఫంక్షన్‌హాళ్ల నిర్మాణాలు చేయించారు. కొన్ని గ్రామాల్లో అందుబాటులోకి వచ్చినా అహ్మదీపూర్‌లో తాళం వేస్తున్నారు. పంచాయతీరాజ్, మండల పరిషత్ అధికారులు చొరవ తీసుకొని ఫంక్షన్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో నిరుపయోగంగా మారిన ఫంక్షన్‌హాల్



గుంతలమయమైన రోడ్డు

## అధ్వానంగా రహదారి

- దెబ్బ తింటున్న వాహనాలు
- రోడ్డు బాగాలేక బస్సులను నిలిపివేసిన ఆర్టీసీ అధికారులు

నర్సాపూర్, డిసెంబర్ 1: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కొండాపూర్ నుంచి సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం షేర్‌ఖాన్‌పల్లి వరకు రహదారి గుంతమయంగా మారింది. ఏడు కిలోమీటర్ల వరకు రోడ్డు అధ్వానంగా మారడం వల్ల వాహనదారులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీళ్లు నిలిచి ఎక్కడ రోడ్డు ఉందో ఎక్కడ గుంత ఉందో తెల్చుకోలేక వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై వెళ్లిన వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. గతంలో నర్సాపూర్ నుంచి పటాన్‌చెరువు వరకు ఈ మార్గంలోనే బస్సులు నడిచేవి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు పటాన్‌చెరుకు వెళ్లడానికి అనుకూలంగా ఉండేది. కానీ, కొన్ని రోజుల నుంచి రోడ్డు బాగాలేదని, బస్సులు పాడైపోతున్నాయని ఈ రూట్లో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. దీంతో దౌల్తాబాద్ మీదుగా చుట్టూ తిరిగి పటాన్‌చెరుకు వెళ్లాల్సి వస్తున్నది. సమయం, డబ్బులు వృథా అవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. విద్యార్థులు చేసేది లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొండాపూర్ నుంచి షేర్‌ఖాన్‌పల్లి వరకు రోడ్డుకు మరమ్మతులు చేయించి బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

#### రోడ్డుపై వెళ్లాలంటేనే భయం



రోడ్డుపై వెళ్లాలంటేనే ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తున్నది. ఎక్కడ గుంత ఉందో ఎక్కడ రోడ్డు ఉందో అర్థంకావడం లేదు. ఇక రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటేనే భయమేస్తున్నది. రోడ్డుపై ప్రమాదాలు జరిగి చాలామంది గాయాలపాలయ్యారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– శ్రీకాంత్, కాగజ్‌మద్దూర్

#### బస్సులు రావడం లేదు




మా గ్రామం నుంచి నర్సాపూర్, పటాన్‌చెరుకు వెళ్లాలంటే బస్సులు రాక అవస్థలు పడుతున్నాం. ఒకప్పుడు ఈ రూట్లో బస్సు నడిచినప్పుడు మంచిగా ఉండేది. రోడ్డు బాగా లేదని అధికారులు బస్సులు నిలిపివేశారు. విద్యార్థులు కాలేజీలకు వెళ్లడానికి బస్సులు లేక తిప్పలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

–ఆంజనేయులు, కాగజ్‌మద్దూర్

## వణికిస్తున్న చలి





రోజురోజుకూ చలిపెరుగుతోంది. దీంతో ప్రజలు చలినుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిద్దిపేట జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో చలి నుంచి రక్షణ పొందేందుకు కొందరు చలిమంటలు కాచుకోగా మరికొందరు పెద్దవాళ్లు, చిన్నారులు వెచ్చదనం కోసం స్వెటర్లు వేసుకుంటున్నారు. వ్యాపారులు రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేయగా ప్రజలు స్వెటర్లు కొనుగోలు చేస్తున్నారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 1





## వాణిజ్య పంటలపై మక్కువ

### సిద్దిపేట జిల్లా బైరాన్‌పల్లికి పసుపు పంట పరిచయం

- పసుపు సాగులో ఇమ్మడి బాల్‌రెడ్డి ఆదర్శం

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 1: ఏటా వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర సంప్రదాయ పంటలు సాగు చేసి విసిగిపోయిన రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఏటా సాగు చేసిన పంటలకు భిన్నంగా వాణిజ్య పంటలపై మక్కువ పెంచుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇమ్మడి బాల్‌రెడ్డి అనే రైతు ఎకరంన్నర భూమిలో పసుపు పంట సాగు చేస్తున్నాడు. పసుపు పంటలో అంతర పంటగా (వానకాలంలో) మొక్కజొన్న సాగుచేశాడు. అంతర పంటతో పసుపు సాగు కోసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు తీరిపోయాయి. ప్రస్తుతం పసుపు పంట ఏపుగా పెరిగి, దంటు వచ్చి ఆశాజనకంగా ఉన్నది. ఎకరంన్నర భూమిలో సుమారు 150 క్వింటాళ్ల పసుపు పంట పండుతుందని రైతు బాల్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. క్వింటాల్‌కు మార్కెట్‌లో సుమారు రూ. 10వేల పైనే ఉంటుందని భావిస్తున్నాడు. దీనికితోడు సీడ్‌ను కూడా అమ్ముకుంటే అదనంగా లాభాలు వస్తాయి. రైతు బాల్‌రెడ్డి సాగు చేసిన పసుపు పంటను చూసేందుకు వివిధ గ్రామాల రైతులు వస్తున్నారు. సిద్దిపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండలంలో పసుపు పంట సాగు చేసిన ఏకైక వ్యక్తి ప్రస్తుతం బాల్‌రెడ్డి మాత్రమేనని వ్యవసాయాధికారులు తెలిపారు.



బైరాన్‌పల్లిలో సాగు చేసిన పసుపు పంట

#### పసుపు సాగుతో అధిక లాభాలు



ఏటా అందరి మాదిరిగానే సంప్రదాయ పంటలు సాగు చేస్తూ వ్యవసాయ రంగంలో ఎన్నో కష్టనష్టాలు చవిచూశా. జహీరాబాద్‌కు చెందిన మిత్రుడి సూచన మేరకు ఈ ఏడాది పసుపు పంట సాగు చేశా. పసుపు పంటలో అంతర పంటగా మక్క సాగుచేశా. మక్క పంటతో పసుపు సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు తీరిపోయాయి. పసుపు పంటతో ఎకరానికి రూ. 10లక్షల వరకు రాబడి ఉంటుంది. ప్రస్తుతం పసుపు పంట చాలా బాగుంది. ఈ పంటను ఏప్రిల్, జూన్ మాసాల్లో సాగు చేసకోవచ్చు. పంట కాల వ్యవధి తొమ్మిది నెలలు. పసుపు పంటకు ఈ ప్రాంతం అనుకూలమైనది. సాగు చేసిన పసుపు పంట సక్సెస్ అయితే రానున్న రోజుల్లోఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు ప్లాన్ చేస్తున్నా. పసుపు పంటను వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి బాగుందని ప్రశంసించారు.

–ఇమ్మడి బాల్‌రెడ్డి, రైతు, బైరాన్‌పల్లి, సిద్దిపేట జిల్లా